సాక్షి
నల్లగొండ
మంగళవారం । 25 । జూలై । 2023



వర్గీకరణ సాధనకు ఉద్యమిద్దాం

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమం ఆగదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. - 10లో



క్యూకాంప్లెక్స్ నుంచే దర్శనం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రూ.150 టికెట్ తీసుకున్న భక్తులను క్యూకాంప్లెక్స్ నుంచి పంపిస్తున్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
31°/25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

నల్లగొండకు రండి సార్..



సీఎం కేసీఆర్‌ను సోమవారం హైదరాబాద్‌లో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కలిశారు. నల్లగొండలో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు రావాలని ఆహ్వానించారు.

కిక్కిరిసిన ఎంసీహెచ్

నల్లగొండ గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) సోమవారం కిక్కిరిసింది. కుటుంబ నియంత్రణ చేయించుకునేందుకు వచ్చిన మహిళలు, నెలవారీ పరీక్షల కోసం వచ్చే గర్భిణులు, పిల్లల వైద్యం కోసం వచ్చే వారితో క్యూలైన్లు నిండిపోయాయి. వీరితోపాటు ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసిన వారు కూడా పెద్ద సంఖ్యలో వైద్యం కోసం ఎంసీహెచ్‌కు వచ్చారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నల్లగొండ



న్యూస్‌రీల్

సాగర్‌డ్యాం ఎస్‌ఈగా నాగేశ్వర్‌రావు



ఎస్‌ఈ నాగేశ్వర్‌రావు

నాగార్జునసాగర్ : సాగర్ డ్యాం ఎస్‌ఈగా నాగేశ్వర్‌రావు సోమవారం విధుల్లో చేరారు. ఈయన మక్తల్ నుంచి నాగార్జునసాగర్ డ్యాం సర్కిల్‌కు బదిలీపై వచ్చారు. నాగేశ్వర్‌రావు గతంలో ఇక్కడ కొన్ని నెలల పాటు ఈఈగా పనిచేశారు.

బదిలీపై వెళ్తున్న ఎస్‌ఈకి సన్మానం

సాగర్ డ్యాం సర్కిల్‌కు ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎస్‌ఈగా పని చేసిన ధర్మనాయక్‌ను సాగర్ డ్యాం ఇంజనీర్లు, సర్కిల్‌లోని ఉద్యోగులు సోమవారం స్థానిక విజయావిహార్‌లో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ధర్మనాయక్ గతంలోనే సీఈగా ప్రమోషన్‌పై హైదరాబాద్‌లోని ఈఎన్‌సీకి వెళ్లారు. ప్రస్తుతం సాగర్ డ్యాం సర్కిల్ ఇన్‌చార్జ్ ఎస్‌ఈ విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఎస్‌ఈ నాగేశ్వర్‌రావు బదిలీపై రావడంతో ధర్మానాయక్ ఆయనకు విధులు అప్పగించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ నాగేశ్వర్‌రావు, ఈఈ మల్లికార్జున్, డీఈలు సుదర్శన్, పరమేశ్ ఉన్నారు.

శాంతి భద్రతల సమస్యగా మారొద్దు

నల్లగొండ క్రైం : భూ సమస్యలు శాంతిభద్రతల సమస్యగా మారకుండా చూడాలని పోలీసులను ఎస్పీ అపూర్వరావు ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో ఆమె మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించారు. భూ సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు రావడంతో సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐలతో ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదులపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. భార్యాభర్తల వివాదాలు, ఫైనాన్స్ గొడవలపై ఫిర్యాదులు రావడంతో సమగ్ర విచారణ జరిపి తగిన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగోన్నతితో బాధ్యత పెరుగుతుంది



అభినందిస్తున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : ఉద్యోగోన్నతి పొందిన వారికి బాధ్యతలు పెరుగుతాయని ఎస్పీ అపూర్వరావు పేర్కొన్నారు. ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన సీఐలు, ఏఆర్ ఎస్‌ఐలను ఆమె సోమవారం అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషినల్ ఎస్పీ హనుమంతరావు, ఆర్‌ఐలు స్పర్జన్‌రాజు, శ్రీను, సంతోష్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు మినీ జాబ్ మేళా

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జూలై 26న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి నంద పద్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ నుంచి డిగ్రీ వరకు ఉత్తీర్ణులైన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 90302 06741, 70956 12963 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ ఎన్జీ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టుల దరఖాస్తు గడువును 27వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులు ఉండి, నెట్, సెట్, పీహెచ్‌డీ, బోధనా అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు జూలై 31న కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు.

ఖర్చుల లెక్క పక్కాగా..

- ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై కేంద్రం నిఘా
- జీఈఎం వెబ్‌సైట్ నుంచి కొనుగోలు చేయాలని ఆదేశాలు
- అక్టోబర్ 2 నుంచి ఈ విధానం అమలుకు నిర్ణయం
- ఇప్పటి వరకు చేసిన ఖర్చుపై కొనసాగుతున్న స్టేట్ ఆడిట్



నల్లగొండ : కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఇచ్చే నిధుల ఖర్చు లెక్క ఇక పక్కాగా ఉండనుంది. ఆర్థిక సంఘం ద్వారా ప్రతినెలా ఇచ్చే నిధులను ఏవిధంగా ఖర్చు చేస్తున్నారన్న విషయంపై నిఘా పెడుతోంది. కేంద్రం నిధులతో స్థానిక సంస్థలు ఏ చిన్న వస్తువైనా కేంద్రం పరిధిలోని జీఈఎం (గవర్నమెంట్ ఈ మార్కెట్) వెబ్‌సైట్ నుంచి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు కూడా అందాయి. ఇక నుంచి గ్రామ, మండల, జిల్లా పరిషత్‌లు ఈ వెబ్‌సైట్ నుంచే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ కొత్త విధానాన్ని ప్రభుత్వం అక్టోబర్ 2న గాంధీజయంతి సందర్భంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే స్థానిక సంస్థలకు ఆదేశాలు కూడా పంపింది.

అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే..

కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులను ఆయా పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తుంది. ఆరు నెలల నుంచి ఈ విధానం అమలవుతోంది. జనాభా ప్రతిపదికన ఆయా గ్రామాలకు నిధులు వస్తున్నాయి. అయితే స్థానిక సంస్థలకు వచ్చే ఆర్థిక సంఘం నిధుల్లో పంచాయతీలకు 85 శాతం, మండల పరిషత్‌లకు 10, జిల్లా పరిషత్‌లకు 5 శాతం చొప్పున విభజించి వారి ఖాతాల్లో జమ చేస్తోంది. ఆ నిధులకు సంబంధించి గ్రామపంచాయతీలు చేసిన పనులకు నేరుగా బిల్లులు పెట్టి డ్రా చేసుకునే అవకాశం ఉంది. వాటి ద్వారా అక్రమాలకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతో వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఈ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. దీంతో స్థానిక సంస్థల్లో నిధుల వ్యయం పూర్తిగా పారదర్శకంగా ఉంటుందని ప్రభుత్వం ఆలోచన. గతంలో నిధుల ఖర్చుపై పర్యవేక్షణ లేక పోవడం వల్ల ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారన్న ఆరోపణ ఉంది.

రూ.25 వేల వరకు నేరుగానే..

అయితే ఈ విధానం ద్వారా పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్ మొదలుకొని ఏ వస్తువు కొనుగోలు చేసినా ప్రత్యేక పోర్టల్ ద్వారా కేంద్రానికి చేరుతుంది. రూ.25 వేల వరకు నేరుగా కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంది. రూ.లక్ష వరకు జీఈఎం వెబ్‌సైట్‌లోని సంస్థల వివరాలను పరిశీలించి ఏ కంపెనీలో వస్తువుల ధరలు తక్కువగా ఉంటాయో ఆ సంస్థ నుంచి మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. రూ.5 లక్షలకు మించి కొనుగోలు చేస్తే బిడ్డింగ్ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలన్న నిబంధన ఉంది.

చేసిన పనులపై ఆడిట్ కూడా..

పంచాయతీల్లో ఇప్పటి వరకు చేసిన పనులపై ఆడిట్ జరగనుంది. స్టేట్, ఏజీ స్థాయిలో ఆడిట్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో రాష్ట్రస్థాయి ఆడిట్ 70 శాతం వరకు పూర్తియింది. ఏజీ స్థాయిలో ఏవైనా కొన్ని పంచాయతీల్లో శాంపిల్ పద్ధతిన ఆడిట్ నిర్వహిస్తారు. 2022–23కు సంబంధించి నిధుల ఖర్చుపై ప్రస్తుతం ఆడిట్ జరుగుతుంది. గ్రామాల్లో జరిగే అభివృద్ధి గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రకారం మండల స్థాయిలో బ్లాక్ డెవలప్‌మెంట్ ప్లాన్, జిల్లాస్థాయిలో డిస్ట్రిక్ డెవలప్‌మెంట్ ప్లాన్ ముందస్తుగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇచ్చిన విధంగానే ఖర్చు చేశారా లేదా అనేది ఈ ఆడిట్‌లో తేలనుంది.

ప్రభుత్వ ఉద్యోగులుగా వీఆర్‌ఏలు

- జిల్లాలో 778 మందికి మేలు



కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

నల్లగొండ : తెలంగాణ ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేస్తు నిర్ణయం తీసుకుంది. దీంతో వారు అంతా ఇక నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో నల్లగొండ జిల్లాలో 778 మందికి మేలు జరుగనుంది. వారి అర్హతను బట్టి ప్రభుత్వం వారికి క్యాడర్‌ను కేటాయించనుంది. జిల్లాలో 778 మంది వీఆర్‌ఏలు ఉండగా వారిలో డిగ్రీ పూర్తి చేసిన వారు 150 మంది, ఇంటర్మీడియర్ పూర్తి చేసిన వారు 180 మందివరకు ఉన్నారు. కొందరు టెన్త్ పూర్తి చేయగా.. మరికొందరు ఏడవతరగతి, కొందరు నిరక్షరాస్యులు కూడా ఉన్నారు. అయితే వారి విద్యార్హతను బట్టి వారికి ఉద్యోగాలు కల్పించనున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపాలిటీ, విద్య తదితర శాఖల్లో ఖాళీల ఆధారంగా వారికి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. ఖాళీలు లేకపోతే తాత్కాలికంగా రెవెన్యూ శాఖలో సూపర్ న్యూమరీ పోస్టుల్లో కొనసాగించే అవకాశం ఉంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో వీఆర్‌ఏలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సోమవారం నల్లగొండ గడియారం సెంటర్‌లో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలు ఉండాలి



అవగాహన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

కేతేపల్లి : పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కనీస సౌకర్యాలు పక్కాగా ఉండేలా చూడాలని అదనపు కలెక్టర్, నకిరేకల్ నియోజకవర్గ ఈఆర్‌ఓ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం కేతేపల్లి మండలంలోని ఇనుపాముల, బండపాలెం, కొండకిందిగూడెం, చెర్కుపల్లి, తుంగతుర్తి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఆమె పరిశీలించారు. మొబైల్ వాహనం ద్వారా ఈవీఎం, వీవీప్యాట్లపై ఓటర్లకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లలో అన్ని సౌకర్యాలు ఉండాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో 'మన ఊరు–మన బడి' పనులను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మారెడ్డి, ఆర్‌ఐ రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు ఉన్నారు.

ఐదు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టు ఐదు క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. సోమవారం ఉదయం ఎగువ నుంచి 7,756 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా ఆదివారం తెరిచి ఉంచిన మూడు క్రస్ట్ గేట్లను యథావిధిగా ఉంచి 3,743 క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి వదిలారు. మూసీ ప్రాజెక్టులో గరిష్ఠం నీటిమట్టం 645 అడుగులు కాగా 642.30 అడుగులకు చేరుకుంది. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో రిజర్వాయర్‌లో నీటి మట్టాన్ని తగ్గించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో ఉదయం తెరిచి ఉంచిన మూడు క్రస్ట్ గేట్లకు అదనంగా సోమవారం సాయంత్రం మరో రెండు గేట్లు ఎత్తి మొత్తం ఐదు గేట్ల ద్వారా 6,221 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టుకు 564 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మూసీ రిర్వాయర్ పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.74 టీఎంసీల నీరు ఉందని అధికారులు తెలిపారు.



మూసీ గేట్ల ద్వారా దిగువకు పోతున్న నీరు

కాంగ్రెస్‌కు 'కుంభం' షాక్!

బీఆర్‌ఎస్‌లోకి యాదాద్రి డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి

- ముఖ్యమంత్రి సమక్షంలో చేరిక
- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కొంతకాలంగా విభేదాలు
- తనకు టికెట్ రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాడని ఆవేదన
- పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం
- నేరుగా ప్రగతిభవన్‌కు వెళ్లి గులాబీ కండువా కప్పుకున్న నేత



కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం కేసీఆర్

సాక్షి, యాదాద్రి : కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడారు. సోమవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సొంత పార్టీకి చెందిన భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఆయనకు కొంతకాలంగా విభేదాలున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్ రాకుండా కోమటిరెడ్డి అడ్డుకునే యత్నం చేస్తున్నాడని, అందుకు బీసీ సామాజిక వర్గానికే టికెట్ నినాదాన్ని తెరపైకి తీసుకువచ్చి ఇబ్బందుల పాలు చేస్తున్నాడన్న ఆవేదనలో అనిల్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. ఇదే విషయాన్ని ఆదివారం సాయంత్రం వలిగొండలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంతో పాటు సోమవారం భువనగిరిలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ముఖ్యకార్యకర్తల మీటింగ్‌లోనూ కుంభం వెల్లడించారు. పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలు తనకు బాధకలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్లుగా పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తనకు ఎంపీ నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. అలాంటప్పుడు తాను పార్టీలో ఎందుకు ఉండాలన్న ధోరణిలో మాట్లాడారు. గ్రూప్ రాజకీయాల వల్ల నెల రోజులుగా కంటినిండ నిద్రకూడా ఉండడం లేదని, మనోవేదనకు గురవుతున్నానని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా నల్లగొండలో ఓడిన కోమటిరెడ్డిని భువనగిరి నుంచి ఎంపీగా గెలిపించుకున్నామన్నారు. అయినప్పటికీ వర్గాలు సృష్టించి పార్టీకి నష్టం చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీ తీరుపై అధిష్టానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను గెలుస్తానన్న నమ్మకం వచ్చిందని, ఇదే తరుణంలో ఎంపీ గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తుండడం తనను కలిచివేసిందన్నారు. తన కుటుంబంలో ఐదారు సీట్లు కోరుకుంటున్న ఎంపీ వెంకట్‌రెడ్డికి బీసీలు ఎందుకు గుర్తు రాలేదని ప్రశ్నించారు. పార్టీ కోసం పనిచేసే నాయకులను చిన్నచూపు చూస్తున్నాడని ధ్వజమెత్తారు. పార్టీకి సమాంతర సమావేశాలు ఏర్పాటు చేయొద్దన్న ఎంపీనే భువనగిరి నియోజకవర్గంలో పోటీ సమావేశాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమన్నారు. గత ఎన్నికల కంటే ముందే పార్టీ మారుతున్నానని తనపై దుష్ప్రచారం చేయించాడని ఆరోపించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నాడని ఎంపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ప్రగతిభవన్‌కు..

భువనగిరిలో జరిగిన కార్యకర్తల సమావేశం అనంతరం అనిల్‌కుమార్‌రెడ్డి నేరుగా ప్రగతిభవన్‌కు బయలుదేరి వెళ్లారు. మంత్రి జగదీశ్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డితో కలిసి వెళ్లారు. అక్కడ సీఎం కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు.

మద్దతు ప్రకటించిన నాయకులు

సమావేశానికి హాజరైన నాయకులంతా అనిల్‌కుమార్‌రెడ్డికి మద్దతు ప్రకటించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపీ వెంకట్‌రెడ్డిపై విమర్శలు చేశారు. 40 ఏళ్ల తర్వాత భువనగిరిలో కాంగ్రెస్ గెలుపొందడానికి అనుకూల వాతావరణ ఏర్పడిందని, ఈ తరుణంలో ఎంపీ గ్రూపు రాజకీయాలు చేయడం తగదన్నారు.

కారెక్కిన రెండవ డీసీసీ అధ్యక్షుడు

యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ అధ్యక్షులుగా పనిచేసిన ఇద్దరు నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. 2019లో పార్లమెంట్ ఎన్నికల ముందు అప్పటి డీసీసీ అధ్యక్షుడు, ఆలేరు మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్ కాంగ్రెస్‌ను వీడి కారెక్కారు. తాజాగా ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి గులాబీ కండువా కప్పుకున్నారు. అనిల్‌కుమార్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు.

మీరివ్వకుంటే.. మేమొచ్చాక ఇస్తాం



ధర్నాలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

- బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు

నల్లగొండ టూటౌన్ : తొమ్మిది సంవత్సరాల బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో జిల్లాలో 90 డబుల్ బెడ్‌రూం ఇళ్లు కూడా ఇవ్వలేదని, అర్హులైన పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి పి.మురళీధర్‌రావు విమర్శించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు మీరివ్వకుంటే మేం తెలంగాణలో అధికారంలోకి వచ్చినకం ఇస్తామని స్పష్టం చేశారు. అర్హులైన పేదలుకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నల్లగొండలోని పెద్ద గడియారం సెంటర్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పేదలకు గూడు లేక ఎండకు, వానకు ఇబ్బందులు పడుతుంటే కేసీఆర్ కుటుంబం మాత్రం అవినీతి, అక్రమాలు, కుంభకోణాలకు పాల్పడుతోందని ఆరోపించారు. సీఎం కేసీఆర్‌కు దమ్ముంటే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎన్ని ఇచ్చారో, ఎన్ని కట్టారో బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. తెలంగాణలో బీజేపీ రాజ్యం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి ప్రదీప్‌కుమార్, నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, శ్రీదేవిరెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పల్లెబోయిన శ్యాంసుందర్, బండారు ప్రసాద్, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, పోతెపాక సాంబయ్య, సాధినేని శ్రీనివాసరావు, కంకణాల నివేదితరెడ్డి, దాసోజు యాదగిరాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టరేట్‌కు వచ్చిన బాధితుల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో అతనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, కలెక్టర్ అనుమతి లేకుండా గైర్హాజరు కావద్దని పేర్కొన్నారు. వచ్చే ప్రజావాణిలో ఆయా శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులు సమీక్షించనున్నట్లు తెలిపారు. ప్రజావాణి వినతులపై తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా సమాచారం తెలియజేస్తూ ప్రజావాణి సైట్‌లో పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నా భార్యకు భూమి పట్టా చేయించాలి



నాది కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామం. నల్లగొండ మండలం మర్రిగూడ శివారులో 255, 257 సర్వే నంబర్లలో 30 గుంటల భూమిని రెండో కుమారునికి రిజిస్ట్రేషన్ చేశాను. పాస్ పుస్తకాలు కూడా ఉన్నాయి. నా కుమారుడు అనారోగ్యంగా ఉన్న సమయంలో 20ఏళ్ల క్రితం నల్లగొండకు చెందిన పారిజాత రూ.5లక్షలు ఇచ్చింది. భూమిని కొనుగోలు చేస్తానని కాగితం రాయించుకుంది. ఆ విషయం తెలిసిన నేను వారి డబ్బులు తిరిగి ఇచ్చాను. కానీ నా కుమారుడు సంతకం పెట్టిన కాగితం ఇవ్వడం లేదు. నేను నా భార్య ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేదు. ఆ భూమిని నా భార్య పేరు మీద పట్టా చేయించగలరు. – మందడి రాంరెడ్డి

మా భూమిని మాకు ఇప్పించాలి



కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామంలో గ్రామ శివారులో సర్వే నెంబర్ 96లో రెండెకరాల వ్యవసాయ భూమి మా పూర్వికుల నుంచి నాకు వచ్చింది. మా తాతల కాలం నుంచే కౌలుకు ఇస్తున్నాం. అయితే ఈ సంవత్సరం నా సేద్యం చేసుకోవాలని విత్తనాలు వేసేందుకు వెళ్లగా అడ్డుకుంటున్నారు. నా దగ్గర పాస్‌బుక్‌లు ఉన్నాయి. భూమి మీదకు వస్తే కేసులు పెడతామని ఎస్‌ఐ కూడా బెదిరిస్తున్నాడు. నా భూమిని నాకు అప్పగించాలి. – మేకల భిక్షమయ్య దంపతులు

అన్నదమ్ములకు పట్టా చేయాలి

త్రిపురారం మండలం పెద్దదేవులపల్లికి చెందిన మాకు వారసత్వంగా సర్వే నంబర్ 864, 865లో భూమి ఉంది. మా నాన్న కబ్జాలో ఉండి మేము సేద్యం చేసుకుంటున్నాం. ఫౌతి విషయంలో మాకు కాకుండా వారసుల భార్యలకు పట్టా చేశారు. ఈ విషయంలో మా అన్నదమ్ములందరికీ గొడవలు జరుగుతున్నాయి. మిగతా వారసులను బెదిరిస్తున్నారు. గ్రామానికి చెందిన బహునూతల నరేందర్ అనే వ్యక్తి సర్వే నంబర్ 865లో తన భూమి ఉందంటూ వస్తున్నాడు. మమ్ముల బెదిరిస్తున్నాడు. ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అన్నీ విచారించి మా భూమిని పట్టా చేసి న్యాయం చేయాలి. – సంగం అంజయ్య, లచ్చయ్య, పెద్దదేవులపల్లి

మాకు ఇళ్ల స్థలాలు ఇప్పించండి



నాగార్జునసాగర్‌లో 30 కుటుంబాలకు చెందిన వాళ్లం కలిసి ప్రభుత్వ భూమిలో ప్లాట్లుగా చేసుకొని నివాసం ఉండేందుకు సిద్ధపడ్డాం. ఫారెస్టు అధికారులు పోలీసులతో కలిసి ఇబ్బందులు పెడుతున్నారు. ఏళ్ల తరబడి సాగర్‌లోనే జీవిస్తున్నాం. ఖాళీగా ఉన్న భూమిలో ఇంటి స్థలం పట్టాలు ఇప్పించాలి. – సాగర్ హిల్‌కాలనీ వాసులు

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలు మృతి


ముత్తమ్మ (ఫైల్)

చిట్యాల: మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఆదివారం సాయంత్రం మృతిచెందింది. గ్రామానికి చెందిన బుర్ర ముత్తమ్మ(102) 1921లో జన్మించింది. ఆమె భర్త గోపయ్య 26 ఏళ్ల క్రితమే మృతిచెందాడు. ఆమెకు నలుగురు కుమార్తెలు, కుమారుడున్నాడు. ఆమె కుమార్తెలు, కుమారుడు, మనుమళ్లు, మనువరాళ్లు కలిపి ఎనభై మంది వరకు ఉన్నారు. ఆమె ఓ ఇరవై రోజుల క్రితమే అనారోగ్యానికి గురై మంచం పట్టారు. 1952లో దేశంలో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో నుంచి 2019లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల వరకు ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం గ్రామంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.

మాజీ మంత్రి వీరేపల్లికి సతివియోగం


సత్యవతి (ఫైల్)

కోదాడఅర్బన్ : కోదాడ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వీరేపల్లి లక్ష్మీ నారాయణరావు భార్య సోమవారం హైదరాబాద్‌లో పరమపదించారు. ఆమె అంత్యక్రియలు ఈనెల 26న హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో నిర్వహించనునట్లు బంధువుల తెలిపారు. ఆమె పార్థీవదేహాన్ని హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో బుధవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఉంచుతారని, అనంతరం దహన సంస్కారం హైదరాబాద్‌లోని రాయదుర్గంలోని మహాప్రస్థానంలో నిర్వహిస్తారని తెలిపారు.

కాలువలో పడి వృద్ధుడు మృతి


ఎల్లయ్య మృతదేహం

వలిగొండ: ప్రమాదవశాత్తు కాలువలో జారి పడి వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. వలిగొండ మండలంలోని వెల్వర్తి గ్రామానికి చెందిన నారి ఎల్లయ్య (80) వృత్తి రీత్యా మేకల కాపరి. రోజుమాదిరిగా మేకలు మేపుతూ గ్రామంలోని బాపును చెరువు కాల్వ వద్ద కాలకృత్యాలు తీర్చుకొని వెళ్తున్నాడు. ఈ క్రమంలో కాల్వ వద్ద ఉన్న బండపై ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. బండపై పడటంతో తలకు బలమైన గాయమై కాల్వలో జారిపడి మృతిచెందాడు. అటుగా వెళ్తున్న గ్రామస్తులు చూడడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడిన సూర్య

వేములపల్లి : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. మిర్యాలగూడ మండలం ఏడుకోట్ల తండాకు చెందిన ధీరావత్ సూర్య తన ద్విచక్ర వాహనంపై మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో వేములపల్లి మండల కేంద్రంలోని సాగర్ ఎడమకాల్వ వంతెన సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూర్య కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు.

కారు బీభత్సానికి వృద్ధురాలు బలి

- కూరగాయల బండ్లు, బైక్‌లు ధ్వంసం


లక్ష్మి (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి) : కారు బీభత్సానికి వృద్ధురాలు బలైంది. ఈ ఘటన తిరుమలగిరిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండకు చెందిన చిలుకమర్రి ప్రవీణ్ తన భార్యతో కలిసి తిరుమలగిరిలో బంధువు అంత్యక్రియలకు హాజరయ్యాడు. అనంతరం సొంత కారులో నల్లగొండకు వెళుతున్నాడు. స్థానిక తెలంగాణ చౌరస్తాకు రాగానే ప్రవీణ్‌కు ఫిట్స్ రావడంతో రోడ్డుకు ఎడమ వైపు ఉన్న ద్విచక్ర వాహనాలను, పక్కనే ఉన్న కూరగాయల బండ్లను వేగంగా ఢీకొట్టుకుంటూ ముందుకు వెళ్లింది. ప్రవీణ్ భార్య వెంటనే హ్యాండ్ బ్రేక్ వేయడంతో ఫుట్‌పాత్‌పై కారు ఆగి పోయింది. అప్పటికే కారు కూరగాయల బండ్ల వ్యాపారి ఊడుగు లక్ష్మి(65)ని ఢీకొట్టడంతో ఆమె తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు కూరగాయల వాహనాలు దెబ్బతిన్నాయి. సంఘటనా స్థలాన్ని స్థానిక పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.



తిరుమలగిరిలో ప్రమాదానికి గురైన కారు, దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలు

ట్రాక్టర్‌ను బావిలో పడేసిన దుండగులు


జేసీబీతో ట్రాక్టర్‌ను బయటకు తీస్తున్న గ్రామస్తులు

రామన్నపేట : పొలం దున్నడానికి గట్టుపై ఉంచిన ట్రాక్టర్‌ను దుండగులు వ్యవసాయబావిలో పడవేశారు.ఈ ఘటన ఆదివారం రాత్రి రామన్నపేట మండలం పల్లివాడ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్లివాడ గ్రామానికి చెందిన నాగులంచె నరేష్ ఆదివారం ట్రాక్టర్‌కు ఫుల్‌వీల్స్ బిగించి పొలం దున్నిన తర్వాత సాయంత్రం బావివద్దనే పార్కింగ్ చేసి వచ్చాడు.దుండగులు అదేరోజు రాత్రి ట్రాక్టర్‌ను సమీపంలోని అతని వ్యవసాయ బావిలో పడవేశారు. కక్ష పూరితంగా ట్రాక్టర్‌ను స్టార్ట్‌చేసి బావివద్దకు తీసుకువెళ్లి అందులో పడవేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. సోమవారం జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను బయటకు తీశారు. ఎస్‌ఐ లక్ష్మయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్యాలయంలో చోరీకి యత్నం

చిలుకూరు : గుర్తుతెలియని వ్యక్తులు పంచాయతీ కార్యాలయంలో చోరీకి యత్నించారు. ఈ ఘటన చిలుకూరులో సోమవారం వెలుగులోకి వచ్చింది. పంచాయతీ కార్యదర్శి షరీఫుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే శనివారం సిబ్బంది చిలుకూరు గ్రామ పంచాయతీకి తీళం వేశారు. అదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయం ప్రధాన తలుపుకు ఉన్న గడీని పగులగొట్టి తలుపులు తీశారు. ఈ విషయం సోమవారం ఉదయం గ్రామ పంచాయితీ తాళం తీసేందుకు సిబ్బంది రాగా తలుపులు తీసి ఉన్నట్లుగా గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శికి తెలియజేశారు. ఆయన వచ్చి చూడగా కార్యాలయంలో ఎలాంటి చోరీకి గురి కాలేదని తెలిపారు. అయితే జీపీ పక్కనే ఉన్న బోరుకు సంబంధించిన ఫీజులు తీసి చెత్తలో పడేసినట్లుగా గుర్తించారు. ఈ విషయంపై చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గురుకుల విద్యార్థినులకు అస్వస్థత


తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

తుంగతుర్తి: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు చెందిన సుమారు 15మంది విద్యార్థినులు సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న విద్యార్థినులు టీచర్ సాయంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ తాము రెండు రోజులుగా కడుపులో నొప్పి, జ్వరం, విరోచనాలతో బాధపడుతున్నామని, తగ్గకపోవడంతో ఆస్పత్రికి వచ్చినట్లు తెలిపారు. రెండు రోజులుగా తాము అనారోగ్యానికి గురైనా ప్రిన్సిపాల్ పట్టించుకోవడంలేదని, తమ తల్లిదండ్రులకు సమాచారం కూడా ఇవ్వలేదని విద్యార్థినులు వాపోయారు. అనంతరం డాక్టర్ మమత మాట్లాడుతూ విద్యార్థినులు కలుషిత నీరు, ఆహారంతోనే అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వైద్య అందిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ రాంప్రసాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి ఈ ఘటనపై విచారణ చేపడుతామని తెలిపారు. ఇప్పటికైన ప్రిన్సిపాల్ నిర్లక్ష్య ధోరణి వీడి పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని గురుకుల పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా నృసింహుడి నిత్య కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని సోమవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి, రాజ్యలక్ష్మీచెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో నూతన పట్టువస్త్రాలంకరణతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాభందనం, పంచగవ్యప్రాశన, ఋత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా నిర్వహించారు. అంతేగాక శివాలయంలోని శ్రీపార్వతీరామింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, బ్రహ్మచార్యులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పాలకవీడు: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. రాత్రి సమయాల్లో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని జాన్‌పహాడ్ సమీపంలో గస్తీ నిర్వహిస్తుండగా కారు, మరో వాహనంలో సుమారు 25 బస్తాల్లో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించినట్లు తెలిపారు. వాహన దారులను అదుపులోకి తీసుకుని విచారించగా ముగ్గురు వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ దాచేపల్లికి చెందినవారుగా తెలిపారు. ఇక్కడ మధ్యవర్తుల ద్వారా కొనుగోలు చేసిన బియ్యాన్ని ఆంధ్రాకు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారన్నారు. ఈ మేరకు వాహనాలను సీజ్‌చేసి, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లింగయ్య తెలిపారు.

రైళ్లపై రాళ్లు విసిరితే ఐదేళ్ల జైలు


వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ ఇంగాలే

నల్లగొండ క్రైం : రైళ్లపై రాళ్లు విసిరితే ఐదేళ్ల జైలు శిక్ష పడుతుందని ఆర్‌పీఎఫ్ సీఐ ఇంగాలే హెచ్చరించారు. సోమవారం నల్లగొండ రైల్వేస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తిప్పర్తి–రామన్నపేట మధ్యలో రైళ్లపై ఎనిమిది చోట్ల రాళ్ల దాడులు జరిగాయని ఇందులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు.మద్యం తాగి రైలు పట్టాలపై నడవడం, రాళ్లు పెట్టడం చట్ట విరుద్ధమన్నారు. రాళ్ల దాడులతో ప్రయాణికులకు ఇబ్బంది, అసౌకర్యం కల్గించరాదని కోరారు. సమావేశంలో ఏఎస్‌ఐ వెంకన్న, బాలునాయక్, సుశీల్‌కుమార్ ఉన్నారు.

ఆగస్టు 4నుంచి సైకిల్, జీప్ యాత్రలు

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్‌మూర్తి

భువనగిరిటౌన్ : విద్యారంగ సమస్యలు పరిష్కారానికి ఆగస్టు 4నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్, జీప్ యాత్రలు నిర్వహించనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్‌మూర్తి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని దుంపల మల్లారెడ్డి ట్రస్ట్ భవన్‌లో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభమై 40 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వ విద్యా సంస్థలకు పూర్తి స్థాయిలో యూనిఫామ్, పాఠ్య పుస్తకాల అందించలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 26వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఐదు సంవత్సరాలుగా ఫీజులు విడుదల చేయక పోవడంతో పేద, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమావేశం కార్యదర్శిలు చింతల శివ, కాసుల నరేష్ జిల్లా ఉపాధ్యక్షుడు లావుడియ రాజు, వేముల నాగరాజు జిల్లా కమిటీ సభ్యులు ఈర్ల రాహుల్, వట్టిపల్లి శివ, మేకల జలంధర్ పాల్గొన్నారు..


బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు

కోదాడరూరల్ : బాలుడి అదృశ్యంపై కోదాడ పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు తాత. పట్టణానికి చెందిన ఓ విద్యాసంస్థల చైర్మన్ కుమార్తెను హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఇచ్చి వివాహం చేశాడు. భార్య భర్తలో మధ్య గొడవలు కావడంతో కుతూరితో పాటు ఆ బాలుడిని కోదాడకు తీసుకొచ్చాడు. అయితే ఈ కేసు కోర్టులో ఉండగా కొడుకుని వారంలో ఓ రోజు చూసేందకు తండ్రికి అనుమతిచ్చింది. కొడుకుని చూపించడం లేదని అల్లుడు ఇటీవల కోదాడకు వచ్చి ఆందోళన కూడా చేశాడు. అయితే సోమవారం తన మనవడు కనిపించడం లేదని రాత్రి కళాశాల చైర్మన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తండ్రే కుమారుడిని తీసుకెళ్లి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

సైకిల్‌పై దేశ యాత్ర

చందంపేట : సైకిల్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేస్తూ హైదరాబాద్‌కు చెందిన బంగారు సిద్ధార్థ్ దేశ వ్యాప్త సైకిల్‌యాత్ర చేపట్టాడు. ఎంబీఏ పూర్తి చేసి ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న సిద్ధార్థ్ దేశ రాజధాని ఢిల్లీ నుంచి 2022 ఆగస్టు 29 సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టాడు. సోమవారం చందంపేటకు చేరిన సందర్భంగా సాక్షితో మాట్లాడుతూ ఇప్పటివరకు 13వేల కిలోమీటర్లు సైకిల్ యాత్ర పూర్తయ్యిందని తెలిపాడు. సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంతో పాటు కాలుష్యాన్ని నివారించవచ్చునని, ఇదే అంశాన్ని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నాడు.

అలరించిన ఇంద్రధనస్సు



రాజాపేట: కొన్ని రోజులుగా వర్షాభావ పరిస్థితులతో యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని కొండ్రెడ్డి చెర్వు గ్రామంలో మంగళవారం ఇంద్రధనస్సు ఏర్పడింది. వివిధ రంగులతో ఏర్పడిన ఇంద్రధనస్సు గ్రామస్తులను ఎంతగానో అలరించింది.

అమ్మ పెళ్లి చేసింది.. పోలీసులకు తండ్రి ఫిర్యాదు

- మైనర్‌ను వివాహం చేసుకున్న యువకుడిపై కేసు

చిలుకూరు : తల్లి ఇష్ట ప్రకారమే మైనర్‌ను వివాహం చేసుకున్న యువకుడిపై చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కోదాడలోని బంజారా కాలనీకి చెందిన నాగరాజు దంపతులకు సంతానం లేదు. ఓ పాపను సాదుకుంటున్నారు. ప్రస్తుతం ఆ బాలికకు 17 సంవత్సరాలు. అయితే, తన తల్లికి తెలిసిన యువకుడితో ఆ బాలికకు పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమకు దారితీసింది. ఈ విషయం బాలిక తండ్రికి తెలియడంతో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో బాలిక తల్లి కుమార్తెతో కలిసి ఇటీవల చిలుకూరు మండలం చెన్నారిగూడెంలోని పుట్టింటికి వచ్చింది. ఈ నెల 14వ తేదీన మైనర్‌ను ప్రేమించిన యువకుడు ఆమె తల్లిని కలిశాడు. ఆమె అంగీకారంతోనే అదే రోజు బాలికను వివాహం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక తండ్రి ఈ నెల 16న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సదరు యువకుడిపై కిడ్నాప్‌తో పాటు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ చేశారు. బాలికను ఇంటికి పంపించి యువకుడిపై కేసు నమోదు చేశారు. మంగళవారం అతడిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిసింది.

అధిష్టానం ఆదేశిస్తే 'మునుగోడు' నుంచి పోటీకి సిద్ధం

- గుత్తా అమిత్‌రెడ్డి


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న అమిత్‌రెడ్డి

చండూరు : బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టానఆదేశిస్తే మునుగోడు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసేందుకు సిద్ధమని శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి ప్రకటించారు. చండూరులో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ముడిగ ఎర్రయ్య యాదవ్ ఇంట్లో సోమవారం ఆయన స్థానిక నాయకులతో మాటామంతి నిర్వహించారు. తాను ట్రస్ట్ ద్వారా పేదలకు సేవ చేయాలనే తిరుగుతున్నట్లు తెలిపారు. నాన్నకు మునుగోడులో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. పార్టీ పెద్దలు ప్రస్తుత ఎమ్మెల్యేకు టికెట్ ఇచ్చినా తాను పని చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. గత ఉప ఎన్నికలో ఇచ్చిన హామీలు ఏంటి? ఏ ప్రాంతంలో ఎన్ని ఓట్లు వచ్చాయి వంటి అనేక విషయాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తున్న దుకాణాలకు జరిమానా


జరిమానా రశీదు అందజేస్తున్న అసిస్టెంట్ కమిషనర్

నల్లగొండ టూటౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న పట్టణంలోని పలు దుకాణాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వహకులకు మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. సోమవారం పట్టణంలోని రామగిరి ప్రాంతంలో పలు దుకాణాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. బేకరీ దుకాణానికి రూ. 3 వేలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ మాట్లాడుతూ నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పర్యావరణం దెబ్బతినకుండా ప్లాస్టిక్‌ను ప్రభుత్వాలు నిషేధించినందున వ్యాపారులందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సురిగి శంకర్, నాగరాజు గౌడ్, గడ్డం శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హరితహారం కార్యక్రమాన్ని అడ్డుకున్న రైతులు


అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

చిలుకూరు: చిలుకూరు గుట్టల్లో అటవీ శాఖకు కేటాయించిన భూమిలో హరితహారంలో భాగంగా సోమవారం ఉపాధిహామీ అధికారులు మొక్కలు నాటేందుకు వెళ్లగా రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు బాధిత రైతులు మాట్లాడారు. తమకు కేటాయించిన భూమిని బలవంతంగా అటవీ శాఖకు అప్పగించారని తెలిపారు. సర్వేచేసి వారికి ఇచ్చే క్రమంలో తమకు వేరే చోట భూమి కేటాయిస్తామని చెప్పి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు భూమిని కేటాయించేంత వరకు మొక్కలు నాటడానికి గుంతలు కూడా తీయనివ్వమని స్పష్టం చేశారు. అ భూమిలో ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. తమకు భూమి కేటాయించాలని పలుమార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరిగినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ క్రమంలో కొద్ది సేపు ఉపాధిహామీ అధికారులకు, రైతులకు వాగ్వాదం జరిగింది. దీంతో ఉపాధిహామీ అధికారులు చేసేది ఏమి లేక వెళ్లిపోయారు.

త్యాగధనులను ప్రజలు మరువరు


వర్ధంతి సభలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

సంస్థాన్ నారాయణపురం : ప్రజా సమస్యల పరిష్కారానికి అసువులుబాసిన త్యాగధనులను ప్రజలు మరిచిపోరని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ అన్నారు. సుక్క అబ్బయ్య, మర్రి నర్సిరెడ్డి, నడికుడి బచ్చయ్య, నడికుడి శంకరయ్యల 24వ వర్ధంతిని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పుట్టపాక గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఎంఎన్ఆర్ ట్రస్టు సహకారంతో ఎస్‌ఎఫ్‌ఐ–డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం సంతోషకరమని అభినందించారు. అమరవీరుల ఆశయసాధనలో భాగంగా ప్రతి ఏటా వివిధ కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశం, పీఎన్‌ఎం రాష్ట్ర అధ్యక్షుడు వేముల ఆనంద్, సుర్కంటి శ్రీనివాసరెడ్డి, దోడ యాదిరెడ్డి, దొంతగాని పెద్దులు ఎంపీటీసీ సభ్యురాలు మర్రి వసంతానర్సిరెడ్డి, గుంటోజు శ్రీనివాసచారి, గడ్డం వెంకటేష్, పిట్ట రాములు, అయితరాజు గాలయ్య, వర్కల చంద్రశేఖర్, తుమ్మల నర్సిరెడ్డి, పాంగుల శంకర్, దొంతగాని అమరేందర్, కొత్త శ్రీకాంత్ తదితరులున్నారు.

యాదాద్రిలో ర్యాంప్‌పై భక్తుల రాక నిషేధం..?

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ అధికారులు తీసకుంటున్న నిర్ణయాలతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొండపైన గతంలో ఉన్న బాలాలయం ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు ర్యాంప్ పైకి భక్తుల రానివ్వకుండా చూడాలని దేవస్థానం అధికారులు ఎస్పీఎ ఫ్, హోంగార్డు సిబ్బంది, సురక్ష సిబ్బందికి ఆదేశించినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఈ మార్గంలో స్థానిక భక్తులతో పాటు రూ.150 టికెట్ కొనుగోలు చేయడానికి వచ్చిన భక్తులు, ప్రొటోకాల్‌లో రూ.300 బ్రేక్ దర్శనం టిక్కెట్ కొనుగోలు చేసిన భక్తులు వచ్చేవారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు ఈ ర్యాంప్ మార్గంలోనే కొండపైన బస్టాండ్ వద్దకు, అక్కడే ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్లకు వెళ్లేందుకు వీలుండేది. ఈ మార్గంలో ప్రొటోకాల్‌లో అధికారులు సంతకం చేసి ఇచ్చిన పాస్ ఉన్న భక్తులు రావాలని, మిగిలిన వారు అటు రాకపోకలు చేయవద్దని పోలీసు సిబ్బందికి ఆదేశించినట్లు తెలుస్తుంది.

వైద్యశాల ఎదుట బంధువుల ఆందోళన

కోదాడరూరల్ : వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందాడని ఆరోపిస్తూ బంధువులు వైద్యశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సంఘటన కోదాడలో సోమవారం చోటు చేసుకుంది. నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు ఆరోగ్యం బాగోలేకపోవడంతో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాయలం ఎదుట ఉన్న ఓ ప్రైవేట్ వైద్యశాల డాక్టర్ వద్ద కొద్దిరోజులుగా చికిత్స తీసుకుంటూ మందులు వాడుతున్నాడు. ఇంటి వద్ద ఆ మందులు వాడుతున్న క్రమంలో అవి వికటించి పరిస్థితి విషమంగా మారిందని, కోదాడలోని అదే వైద్యశాలకు తీసుకరాగా పరీక్షించిన డాక్టర్ మృతిచెందినట్లు తెలిపారన్నారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువుల డాక్టర్ నిర్లక్ష్యంతోనే శ్రీకాంత్ మృతిచెందాడని వైద్యశాల ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని డాక్టర్ వైద్యంపై ఎదైనా అనుమానం ఉంటే స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు.

యాదాద్రి క్షేత్రంలో మంత్రి ఎర్రబెల్లి పూజలు


మంత్రికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్యులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు. శ్రీస్వామిని దర్శించుకున్న మంత్రి ఎర్రబెల్లి దయాకకర్‌రావుకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

కూలిన పాత భవనం.. తప్పిన ప్రమాదం


బొడ్రాయి బజార్‌లో రోడ్డు మీద కూలిన పాతభవనం

కోదాడ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పట్టణంలోని బొడ్రాయి వద్ద ఉన్న పాత భవనం పాక్షికంగా కూలి రోడ్డు మీద పడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. పాత భవనం మీద చెట్లు పెరిగి విద్యుత్ తీగలకు తగులుతుండడంతో తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఇటీవల చెట్ల కొమ్మలను తొలగించారు. భవనం ప్రమాదకరంగా ఉందని మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే పాతభవనాన్ని కూల్చివేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని బొడ్రాయిప్రాంత వాసులు కోరుతున్నారు.

గిరిజన బాలుడి మృతిపై ఆర్డీఓ విచారణ


భీల్యానాయక్‌తండాలో విచారణ జరుపుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

మఠంపల్లి: మండలంలోని భీల్యానాయక్‌తండాకు చెందిన భూక్యారమేష్ స్వాతి దంపతుల కుమారుడు శివుడు(3) ఆదివారం హుజూర్‌నగర్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. వైద్యం వికటించడంతోనే బాలుడు మృతిచెందాడని మృతుడి తండ్రి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో సోమవారం హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి భీల్యానాయక్‌తండాలోని బాలుడిగ ఇంటికి వెళ్లి విచారణ జరిపారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సాయాగౌడ్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, ఆర్ఐ సుజిత్ తదితరులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Wanted

■ Wanted Experienced Teachers for E/M High School. Sub: English, Science, Maths, Social Studies, Salary: Negotiable. Ramannapet, Yadadri Bhongir. Cont: 9652531679 [Y-753148]

■ Wanted Lady Wardens and Maths Faculty For Junior College in Nalgonda Town. Contact: 8520959453, 8520959452 [YA-14928]

■ నల్లగొండ పట్టణంలో ప్రముఖ ఫ్యామిలీ రెస్టారెంట్ నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్, సప్లయర్స్ కావలెను. సంప్ర॥9490137577, 9640532336 [Y-798241]

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221467]

■ కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. మీ అర్హతకు తగిన విధంగా సంపాదియకునే అవకాశం. పార్ట్ టైం 8000. ఫుల్ టైం 20000/- 7993700904, 9014504770, 8977743043. [W-1002992]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము, హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, వార్డ్ బాయ్స్, భార్యాభర్తలు డ్రైవర్స్ కావలెను. ఫోన్ : 9391036931, 9246585901 [HA-11711]

■ ప్రముఖ కంపెనీ నందు పనిచేయుటకు FMCG అనుభవం గల డిస్ట్రిబ్యూటర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 15,000/- TA + DA. ✆ 77804 42785 [B-190709]

Services

■ మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788604]

OLDAGE HOME

■ భాను ఓల్డేజ్ హోం, సూర్యాపేట, వృద్ధాప్యం, పక్షవాతం తో మంచాన ఉన్న వారికి 24 గంటలు నర్స్, ఆయా, ఫిజియోథెరపి సేవలు అందించబడును. సంప్ర॥ 9281044956, 8142738346 [Y-1146214]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.